విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ఎలమర్రులో గ్రామసభ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని ఎలమర్రు పంచాయతీ వద్ద సర్పంచ్ కొల్లూరు అనూష అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఈ సభకు ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి హాజరై 2023-24 సంవత్సరంలో చేసే ఉపాధి పనులను ఆమోదించారు. అనంతరం గృహ నిర్మాణశాఖ అధికారులతో, అలాగే లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగల పద్మ, హౌసింగ్ ఏఈ మల్లికార్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం : ఎస్పీ

విశాలాంధ్ర-మచిలీపట్నం: చట్టపరిధిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉందని ఎస్పీ పి. జాషువా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి స్పందనలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాషువా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలపై జాప్యం వహించకుండా చట్టపరిధిలో విచారణ చేసి పరిష్కారం అందించేలా కృషి చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను పరిశీలించి ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు బదిలీ చేశారు. చట్టపరిధిలో వాటినిపరిష్కరించాలని సూచించారు. ఉంగుటూరుకు చెందిన స్వాతి తనకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారనే కారణంతో అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని ఆరోపించారు. తన భర్తను తనను ఇంటి నుండి వెళ్ళిపోమని వేధిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. కలిదిండికి చెందిన కీర్తి తన భర్త ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించారు. తనను వేధిస్తున్నాడని, పెద్దలలో పంచాయతీ పెట్టినా తన ప్రవర్తన మారడం లేదని ఫిర్యాదు చేశారు. మచిలీపట్నంకు చెందిన వరప్రసాద్ రొయ్యలసాగు చేసిన రొయ్యలను రేపల్లెకు చెందిన సీఫుడ్స్‌కు అమ్మగా కొంత మొత్తాన్ని చెల్లించారన్నారు. మిగిలిన సొమ్మును చెల్లించటం లేదని, ఫోన్ చేస్తే సమాచారం ఇవ్వకుండా ఫోన్ స్విచాఫ్ చేసి తప్పించుకు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు.

హోంగార్డు కుటుంబానికి రూ.3.94 లక్షల చెక్కు

కృష్ణాజిల్లా హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన హెూంగార్డ్ డి.రమేష్‌కుమార్ కుటుంబానికి తోటి హెూంగార్డుల ఒకరోజు వేతనం రూ.3,94,806 చెక్కును జిల్లా ఎస్పీ పి.జాషువా సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జాషువా మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా, ఏ ఇబ్బందులు ఎదురైనా నేరుగా తెలుపవచ్చన్నారు. రమేష్ మరణించినప్పటికి మీరంతా పోలీస్ కుటుంబసభ్యులే అన్నారు. మీకు అండగా కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు.

అర్జీలు నిర్ధేశిత గడువులోగా పరిష్కరించాలి : డీఆర్వో

విశాలాంధ్ర-మచిలీపట్నం: స్పందన అర్జీలు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, రీఓపెన్ అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్పందన అర్జీలు పరిష్కారంతో పాటు గ్రామదర్శిని కార్యక్రమం క్రింద గుర్తించిన సమస్యలు అప్‌లోడ్ చేయాలన్నారు. తద్వారా వాటి పరిష్కారానికి వివిధ శాఖలకు ఆయా సమస్యలు పంపడం జరుగుతుందన్నారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మీపద్మ తన భర్త గత జూలైలో మరణించారని, భర్త ఉద్యోగం తాలూకా ప్రయోజనాలు పొందుటకు గాను ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరుతూ స్పందనలో అర్జీ ఇచ్చారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నాయీ బ్రాహ్మణ సవితా సమాజం ప్రతినిధులు బి.లక్ష్మీకోటయ్య తదితరులు స్పందనలో అర్జీ సమర్పించారు. బంటుమిల్లిలో నటరాజ వెంకటేశ్వర సినిమాహాలు స్థలం ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ వేణుగోపాల పూర్ణచంద్రరావు అర్జీ సమర్పించారు. సమావేశంలో ముడా విసి నారాయణరెడ్డి, ఆర్డీవో ఐ.కిషోర్, డ్వామా పిడి జి.వి.సూర్యనారాయణ, సిపివో వై.శ్రీలత, డీఎస్‌వో పార్వతి, డీపీఓ నాగేశ్వర నాయక్, డీఈవో తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

చేపలతో ప్రయోజనాలు

మత్స్యసంపదను పెంపొందించుకోవాల్సిన బాధ్యత అందరిది: కలెక్టర్ బాషా

విశాలాంధ్ర-మచిలీపట్నం: పర్యావరణాన్ని కాపాడి, మత్స్య సంపదను పెంపొందించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. సోమవారం ప్రపంచ మత్స్యదినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మత్స్యదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని అధ్యయనాల ప్రకారం సముద్రపు చేపలతో ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడైందన్నారు. ఎన్నో రకాల అనారోగ్యాలను తట్టుకునే శక్తి కూడా సముద్రపు చేపలు అందిస్తాయని ఒక పరిశోధన తెలిపిందన్నారు. చేపల చెరువుల్లో యజమాని పెట్టే ఆహారాన్నే చేపలు తింటాయని, సముద్రంలో స్వేచ్ఛగా తిరిగే చేపలు ఒమేగా 3ఫ్యాటీ ఆమ్లాలను ఇచ్చే మొక్కలను తింటాయన్నారు. సముద్రపు అడుగున ఉండే మొక్కల్ని తినే చిన్న చేపలను పెద్ద చేపలు ఆరగిస్తాయని, పెద్ద చేపలను వాటి కన్నా పెద్ద చేపలు తింటాయన్నారు. సీఫుడ్ చాలా మంచిదన్నారు. కృష్ణాజిల్లాలోని మొత్తం 25 మండలాలలోని 4 తీర ప్రాంత మండలాల్లో 111 కిలోమీటర్ల సముద్రతీరం ఉందని, మొత్తం 37348 ఎకరాలలో మంచినీటి చేపల పెంపకం, 51440 ఎకరాల్లో ఉప్పునీటి చేపలు, రొయ్యల పెంపకం జరుగుతున్నట్లు తెలిపారు. 2021-22 సంవత్సరానికి 13.76 లక్షల టన్నుల చేపల, రొయ్యల ఉత్పత్తికి రూ.17527.07 కోట్ల బి.వి.వి. వచ్చిందన్నారు. కృష్ణాజిల్లాలో వేలాది మత్స్యకారులకు 2022-23 వేట నిషేధ భృతి కింద 11850 మందిని అర్హులుగా ప్రతిపాదించగా 10915 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు అందచేయడం జరిగిందన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు వెన్నుదన్నుగా సీఎం జగన్ నిలుస్తున్నారన్నారు. మత్స్యకారులను ప్రోత్సహించడం కోసం, మత్స్యపరిశ్రమను నిర్వహించడం కోసం చేపపిల్లలను పంపిణీ చేయడం, ఆక్వారంగా నికి చేయూతనివ్వడం అన్ని రాష్ట్రాలు చేసే పనే అయినప్పటికి మత్స్యపరిశ్రమలో ఉన్న రైతులు ఉత్పత్తి చేసిన చేపలను మార్కెటింగ్ చేయడం కోసం మన ప్రభుత్వం మాత్రమే ప్రత్యేకమైన దృష్టి సారించిందన్నారు. పోషకవిలువలు ఎక్కువగా ఉండే చేపలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఆక్వారైతులు సాగు చేసే స్వచ్ఛమైన చేపలు మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజల్లోను చేపలపై ఆసక్తి పెంపొందించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం భావించడం ఎంతో అభినందనీయమన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల ప్రజలకు ఈ ప్రభుత్వం ఎంతో బాసటగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు చింతా గోవిందరాజులు, డిప్యూటీ మేయర్ తంటిపూడి కవితా థామస్ నోబుల్, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎన్.శ్రీనివాసరావు, ఆర్డీవో ఐ.కిషోర్, 20వ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ మట్టా తులసి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్

విశాలాంధ్ర-చల్లపల్లి : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయం అని తహసీల్దార్ కే.గోపాలకృష్ణ అన్నారు. ఐవీఎం పురిటిగడ్డ సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ తహసీల్దార్ కార్యాలయానికి రూ.30 వేలు విలువ కలిగిన నూతన ప్రింటర్ బహుకరించారు. తహసిల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీటీ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ ప్రభు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కొత్త మెనూతో 'జగనన్న గోరుముద్ద'

విశాలాంధ్ర-కూచిపూడి : సర్కారుబడులలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసినఉత్తర్వులు సోమవారం నుంచి అమలు లోకి వచ్చాయి. ప్రస్తుతం మెనూ గా అందజేసే అన్నం, పప్పు చారు, కోడి గుడ్డు కూర, చిక్కి స్థానంలోకొత్త మెనూగా హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు/ కూరగాయల పులావ్, చిక్కి, కోడిగుడ్డు కూరను మధ్యాహ్నం భోజనంగా జగనన్న గోరుముద్దలో అందజేయాలని మిడ్ డే మీల్స్ డైరెక్టర్ పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. కూచిపూడిలోనే శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్లో మెనూగా వెజిటేబుల్ రైస్, కోడిగుడ్డు కూర, చిక్కీలను పాఠశాలలో విద్యార్థులకు అందజేసినట్లు అన్నే లక్ష్మీ కుమారి తెలిపారు.

గుడ్లవల్లేరు మండలంలో 70 శాతం భూరీ సర్వే పూర్తి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలో గ్రామాల పరిధిలోని ప్రభుత్వ ప్రభుత్వేతర భూములకు సంబంధించి చేపట్టిన భూ రీ సర్వే పనులు 70 శాతం పూర్తయ్యాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాస్తి అరవింద్ సోమవారం చెప్పారు. మండల సర్వేయర్ రామకృష్ణ గ్రామ స్థాయి సర్వేయర్‌లు, వీఆర్‌ఓల సహకారంతో ఈ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మండలంలో మరో నాలుగు ప్రధాన రెవిన్యూ గ్రామలలో భూరీసర్వే పనులు ప్రారంభమయ్యాయనీ ఆయా గ్రామాలలో కూడా త్వరితగతిన ఈ పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు అరవింద్ వివరించారు.

భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-బంటుమిల్లి : జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొర్లపాడు గ్రామపంచాయితీ కార్యదర్శి శివకుమారి సోమవారం పాత్రికేయులకు వివరించారు. కొర్లపాడు గ్రామపంచాయతీ ఏరియాలో జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా గ్రామ కంఠంలోని ఆస్తులకు సంబంధించిన భూ యజమానులు ముసాయిదా జాబితా గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉందన్నారు. జాబితాపై అభ్యన్తరలు ఉంటే ఈ నెల 25వ తేదీలోగా రాత పూర్వకంగా తహశీల్దార్ తెలపాలన్నారు.

తెలుగు సావిడి ఇష్టాగోష్టి అభినందనీయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రముఖ కవి నన్నయ తెలుగు జాతికి సాహిత్యానికి చేసిన సేవ గురించి నేడు తెలుగు సావిడిలో ఇష్టాగోష్టి నిర్వహించటం అభినందనీయమని మాజీ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. స్థానిక అగ్రహారం లోని కళారత్న డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసిన "తెలుగు సావిడి"లో నన్నయ సాహిత్యం అనే అంశంపై సాహితీ సమాలోచన చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండలి రాజరాజ నరేంద్రుని గురించి నన్నయ సాహిత్యం గురించి వివరించారు. ఆధునిక జీవన ప్రమాణంలో తెలుగు భాషను, సాహిత్యాన్ని, సంప్రదాయాలను మరిచిపోకుండా ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్న డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కి కృతజ్ఞతలు తెలియచేస్తూ, దివిసీమ లో ఏదైనా మొదలుపెడితే అది ప్రపంచానికి దిక్సూచి లా మారుతుంది అటువంటి వారిలో దివిసీమ గర్వించదగ్గ మహోన్నత వ్యక్తులలో డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఒకరని అన్నారు.నేడు ప్రపంచవ్యాప్తంగా దివిసీమ గొప్పదనాన్ని చాటుతూ తెలుగు సాహిత్యంలో కొత్త పుంతలు సృష్టించిన నన్నయ సాహిత్యం గురించి నేడు ప్రజలకు వివరించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ నన్నయ కవితా వైభవాన్ని, నన్నయ కవిత్వంలో ఉన్న వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పద్యాలను చదివి వివరణ ఇచ్చారు. సభలో డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, పూషడపుసుబ్బారావు, నన్నయ కవిత్వంలోని అంశాలను వివరించి తెలిపారు సభలో దీవి ఝాన్సీ సింహాద్రి పద్మ కరుణశ్రీ కొండవీటి ఈశ్వరరావు మున్నగువారు పాల్గొన్నారు.

తేమ శాతం ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి : రావి

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ మండలం బొమ్ములూరులో కల్లాల్లో అరబెట్టిన వరి ధాన్యపు రాశులను సోమవారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరిశీలించారు. అనంతరం అర్.బి.కే కేంద్రం ముందు రైతులతో కలసి ఆందోళన చేశారు. తేమ శాతం పేరుతో రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం సవరించాలన్నారు. షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణేశ్వరరావు. టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నిమ్మగడ్డ సాయి, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, నాయకులు జెబీన్, ఆర్నేపల్లి పాండు, ముళ్ళపూడి రమేష్, పాల్గొన్నారు.

రైల్వే బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌లో విజయవాడకు కాంస్యం

విశాలాంధ్ర-విజయవాడ,(గాంధీనగర్) : ఇటీవల సౌత్ ఈస్టర్న్ రైల్వేలోని చక్రధ్రపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా రైల్వే బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడలోని మెకానికల్ విభాగం కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఉదయ్ కుమార్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఈయన దక్షిణ మధ్య రైల్వే బాడీ బిల్డింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 90 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. వచ్చే డిసెంబర్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇండియన్ రైల్వే బాడీ బిల్డింగ్ టీమ్ కోచింగ్ స్పెషల్ క్యాంప్‌కు తాత్కాలికంగా అర్హత సాధించాడు. గత ఏడాది చెన్నైలో జరిగిన బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో కూడా ఇదే విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

మొవ్వ పీహెచ్‌సీలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాజేశ్వరి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ పీ.హెచ్.సీలో ఎట్టకేలకు రెండవ డాక్టర్ పోస్ట్ సోమవారం లేడీ డాక్టర్ జాయిన్ అవ్వడంతో భర్తీ అయ్యింది. 6 నెలలు కాలంగా రెండవ పోస్ట్ ఖాళీగా ఉండటంతో విజయవాడ అర్బన్ నుంచి డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి బదిలీపై విచ్చేశారు. ఆమె డాక్టర్ వైయస్సార్ హెల్త్ క్లినిక్ లో వైద్యురాలుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఆమెను వైద్యులు డాక్టర్ ఎం వేదరాజ్, ఏఎస్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాల ద్వారా సార్వా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా సోమవారం చెప్పారు. ఈ మేరకు ఆయా రైతు భరోసాకేంద్రాల నిర్వహకులతో సమీక్ష నిర్వహించామని ఆయన అన్నారు. నిబంధనలకనుగుణంగా రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలనీ గోనె సంచులను సిద్ధం చేసుకోవాలని కోరియున్నామని తహశీల్దార్ వివరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రజా సమస్యలు పరిష్కారానికే సీఎం జగన్ గడప గడపకు కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం మంటాడలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గత రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎమ్మెల్యె కైలే మాట్లాడుతూ మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందమూడి వీరమ్మ యంపిటిసి మేరుగ శ్రీ లక్ష్మి యం.మహేష్, వైస్ యంపిపి కొడమంచిలి మహేష్ యేనుగ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : పుట్టినరోజు వేడుకల సందర్భంగా భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులతో కలసి పంచుకోవడం అభినందనీయమాని తోట ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక భాస్కర్‌దియోటర్ సమీపంలోని భవిత కేంద్రంలో తోట శ్రీరామ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌పి ప్రసాద్, ఉపాధ్యాయులు ఎం.కె నీలంబరామ్, ఎం.రాములు, పి.శారద తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా చేశారు : బచ్చుల అర్జునుడు

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం నియోజకవర్గ ఉంగుటూరు మండలం ఉంగుటూరులో గ్రామ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ, టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అప్పులు తెచ్చి ఆ అప్పులు తీర్చడానికి తిరిగి మళ్లా అప్పులు తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేశారో ఎన్ని కొత్త కంపెనీలు నెలకొల్పారు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ళ వెంకటకృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి ఆళ్ళ హనూక్ గ్రామ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు సుధాం ఏడుకొండలు సెక్రెటరీ పూసపాటి జై ప్రకాష్పోద్దు బాలస్వామి, పూసపాటి అశోక్, కొత్త అనిత, కొత్త జోగి వర ప్రసాద్, మేకతోటి రాజేష్, మాచవరపు సాయి బాబు కొత్త రంగారావు, సూధం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మత్తికి సర్వేపల్లి జాతీయ అవార్డు

విశాలాంధ్ర-అవనిగడ్డ : హైదరాబాదులో ఆదివారం జరిగిన ఆల్‌ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ విశిష్ట ప్రతిభా పురస్కారాల్లో దివిసీమ ఆణిముత్యం మత్తి నాగమల్లేశ్వరరావుకి సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డును తెలంగాణ హైకోర్టు జడ్జి ఎస్.నంద, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జి.చంద్రయ్య, సంగీతనాటక అకాడమీ(న్యూఢిల్లీ), చైర్మన్ ఎస్పీ భారతిలు అందజేశారు. ప్రతిష్టాత్మకమైన సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డును-2022ను స్వీకరించిన మత్తి నాగమల్లేశ్వరరావుకి దివిసీమ ప్రజలు అభినందనలు తెలిపారు.

వాయు'గండం'గా అల్పపీడనం

రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి సోమవారం నుంచి కురుస్తున్న వర్షం జల్లులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 10 నుంచి వరికోతలు మొదలై ఊపందుకున్నాయని, ఈ జల్లులు ఇంతటితో ఆగిపోతే నష్ట ముండదని, కొనసాగితే ధాన్యం రంగు వారే ప్రమాదముంటుందని గగ్గోలు పెడుతున్నారు.

ఆకాశం మబ్బులు.... రైతులు ఆందోళన..

విశాలాంధ్ర-పమిడిముక్కల: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం తో ఆకాశమంతా మబ్బులు చిరుజల్లులు పడుతుండంతో వరి పంట కొంత పైనలపైన కొంత కోత కోయకుండా ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం నుంచి చినుకులు పడుతుండటంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎలా రక్షించాలని రైతులు మదన పడుతున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో అప్టిమా ఆరోగ్య బీమా ప్రీమియంపై వడ్డీ రహిత వాయిదా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో అప్టిమా రక్షిత ఆరోగ్య బీమా ప్రణాళిక కొసం వాయిదాల్లో ప్రీమియమ్ చెల్లింపు ఎంపిక పయనీరింగ్ లక్షణాన్ని విడుదల చేస్తోంది. తద్వారా, కంపెనీ వినియోగదారులకు ఆరోగ్య బీమా మరింత పెట్టుకునేట్లుగా, సౌకర్యవంతంగా చేయాడాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, ఇంకా బీమాని కలుపుకోవడం పెద్ద ఎత్తున వినియోగదారులలోకి తీసుకువెళుతోంది. పాలసీ ఐదేళ్ళ తరువాత రెన్యువల్ వద్ద వారు ఆప్ట్ చేసుకున్న డిడక్టబుల్ మాఫీకి అనుమతించే సులువైన మార్చుకునే ఎంపికతో వినియోగదారులకు సాధికారత ఉందని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ పార్థనిల్ గోష్ వెల్లడించారు.

ఐసీఐసీఐ ప్రు సుఖ్ సమృద్ధి పథకం విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ నూతన పార్టిస్పేటింగ్ పొదుపు పథకం ఐసిఐసిఐ ప్రు సుఖ్ సమృద్ధి పథకం విడుదల చేసింది. ఇది వినియోగదారులకు గ్యారెంటీడ్ ప్రయోజనాలు, బోనస్ రూపంలో వృద్ధి అవకాశం వంటి ద్వంద్వ ప్రయోజనాలను అందిస్తుంది. పాలసీ కాలం మొత్తానికీ జీవిత బీమా కవరేజీ అందించడంతో పాటుగా కుటుంబానికి ఆర్థిక భద్రత సైతం అందిస్తుంది. వైవిధ్యమైన వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు ఈ దీర్ఘకాలిక పొదుపు పథకం ఆదాయం, ఏకమొత్తం రూపంలో లభిస్తుందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పల్టా తెలిపారు.

రేపు కేబీఎన్‌లో 42వ రాష్ట్రస్థాయి సారస్వత పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కాకరపర్తి భావనారాయణ కళాశాల డిబేటింగ్ అండ్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న 42వ రాష్ట్రస్థాయి సారస్వత పోటీలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తెలిపారు. తమ కళాశాల ఆధ్వర్యంలో 41 ఏళ్లుగా కళాశాలల విద్యార్థులకు వివిధ రకాల సారస్వత పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విజేతలకు రోలింగ్ షీల్డ్‌లతో పాటుగా వ్యక్తిగత బహుమతులు, బంగారు, వెండి పతకాలు సైతం అందిచబడతాయని వివరించారు. ప్రారంభోత్సవ సభకు ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌ఓ మోహన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో గోల్డ్, వెండి పతకాలు అభినందనీయం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : జాతీయ స్థాయిలో స్విమ్మింగ్ పోటీల్లో పది గోల్డ్ మెడల్స్, ఐదు వెండి పతకాలు రాటం అభినందనీయమని నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అస్సాం రాష్ట్రం గౌహతిలో ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు జరిగిన పారా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో (వికలాంగుల) నగరానికి బంగారు, వెండి పథకాలను సాదించిన విద్యార్థులు, కోచ్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ డైరెక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ పారా జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం 35 పతకాలు రాగ అందులో 15 పతకాలు విజయవాడ నగరంలోని జింఖానా గ్రౌండ్‌లో సర్‌విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన వారికి రావడం జరిగిందని తెలిపారు. స్విమ్మింగ్ పట్ల ఆశక్తి కనపరచటం ఎంతో అభినందనీయమని కొనియాడుతూ రాభోవు రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి క్రీడాకారునిగా మంచి గుర్తింపును పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో శిక్షణ ఇచ్చిన కోచ్‌ను అభినందించారు.

అక్రమరవాణా బాధితులకు పునరావాసం కల్పించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వ్యాపార లైంగిక దోపిడీ కోసం ట్రాఫికింగ్ నుండి రక్షించబడిన భాదితులను తిరిగి పూర్వస్థితికి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న కమ్యూనిటీ ఆధారిత పునరావాసంపై దృష్టి పెట్టడానికి ఇది సరైన సమయం. ఇతర రకాల సమస్యలతో సహా పేదరికం సమాజంలోని బాలలు-మహిళలపై జరిగే అన్ని రకాల హింసలకు దారి తీస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్ర పేర్కొన్నారు. సోమవారం హోటల్ ఐలాపురంలో హెల్ప్,విముక్తి నిర్వహించిన కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్ (సిబిఆర్)పై వివిఎల్‌సిపిసిలు, పిఆర్‌ఐల సెన్సిటైజేషన్' రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ అక్రమ రవాణా బాధితులు తిరిగి మరలా అక్రమ రవాణాకు గురికాకుండా వారి అవసరాలను తీర్చడానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు-స్వచ్ఛంద సంస్థలు సమన్వయతో కృషి చేయాలన్నారు. ట్రాఫికింగ్,ఇతర రకాల హింస నుండి రక్షించబడిన వారు ఇప్పటికే ఉన్న సంక్షేమ పథకాల ప్రయోజనాలతో సహా రాష్ట్ర సహాయ సేవలను పొందడంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఇది భాదితులనే కాకుండా వారి పిల్లలను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. హెల్ప్ సెక్రటరీ రామ్‌మోహన్. నిమ్మరాజు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్ ఆవశ్యకత వివరించారు. ఈ సమావేశంలో విముక్తి అధ్యక్షురాలు అపూర్వ, సచివాలయాల నుంచి మహిళా పోలీసులు, సంక్షేమ కార్యదర్శులు, పంచాయతీ రాజ్ సభ్యులు, కమ్యూనిటీ బాలల రక్షణ కమిటీ సభ్యులు, హెల్ప్ సిబ్బంది,విముక్తి నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం నిరాధారమైన ఆరోపణలు

విశాలాంధ్ర-విజయవాడ,(గాంధీనగర్) : రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే విధంగా కుట్రపూరితంగా వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయుడిని తక్షణం అరెస్టు చేసి ప్రజల్లో రాజ్యాంగ వ్యవస్థల పట్ల నమ్మకం కలిగించాలని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు కోరారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమ వారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం టిడిపి పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన పోలీసు, న్యాయ వ్యవస్థలను కించపరిచే విధంగా పరుష పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, రాజ్యాంబద్ధ వ్యవస్థలపై ప్రజలలో వున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని సన్నగిల్లేలా కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి విధులు నిర్వహించడంలో కట్టు బానిసలుగా ఉంటారు తప్ప, ఏ రాజకీయ పార్టీలకు గాని, వర్గాలకు గాని వంత పాడరన్న వాస్తవం తెలుసుకోవాలన్నారు. మీ ప్రాణాలకు ఎటువంటి హాని కలుగకుండా మీ వ్యక్తిగత భద్రత కోసం 250 మంది సెక్యూరిటీగా మా పోలీసులు తమ విధులకు అంకితమై, మీ భద్రత పట్ల కట్టుబానిసల్లా విధులు నిర్వర్తిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు న్యాయపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.సోమయ్య, జి.అక్కిరాజు, ఆర్.నాగేశ్వరరావు, ఆర్.రఘురామ్, ఎ.కె.డి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఏపీ ఎన్జీఓస్ గన్నవరం అధ్యక్ష, కార్యదర్శులుగా సాంబశివరావు, వంశీ మోహన్‌కృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఏపీ ఎన్జీఓస్ గన్నవరం అధ్యక్ష, కార్యదర్శిగా సాంబశివరావు, వంశీ మోహన్ కృష్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం.రాజుబాబు తెలిపారు. స్థానిక ఏపీ ఎన్జీవోస్ హెూమ్‌లో సోమవారం గన్నవరం ఎన్జీవోస్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎం.రాజుబాబు మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు నామినేషన్లు స్వీకరించడం జరిగిందని తెలిపారు. 11 పదవులకు పదకొండు నామినేషన్లు రావడంతో సాంబశివరావు, వంశీ మోహన్‌కృష్ణ ప్యానెల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారిగా ఎం.రవి(ఖజానా శాఖ), సహాధ్యక్షుడిగా టీవీ.నాంచారయ్య (పంచాయతీరాజ్ శాఖ), ఉపాధ్యక్షులుగా పి.సురేందర్ (వైద్య ఆరోగ్యశాఖ) ఎ.సునీల్ కుమార్ (రెవిన్యూశాఖ) ఎస్ శ్రీనివాస్ (పశుసంవర్ధక శాఖ) సంయుక్త కార్యదర్శులుగా సి.వి.ఎల్.ఎస్.ఆర్.వి ప్రసాద్(పంచాయతీరాజ్ శాఖ) జి.చంద్రశేఖరరావు (వైద్య ఆరోగ్యశాఖ) ఎ.సాల్మన్‌రాజు (బీసీ వెల్ఫేర్ శాఖ) మహిళ సంయుక్త కార్యదర్శిగా కె.సూర్యకళ (రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్ అభినందనలు తెలిపారు. గన్నవరం ఎన్జీవోస్ ఎన్నికల్లో సహాయ ఎన్నికల అధికారిగా యూవీ పురుషోత్తంరాజు, ఎన్నికల పరిశీలికలుగా విశ్వనాథ్ వ్యవహరించారు. వీరితో జిల్లా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్నికైన సాంబశివ రావు వంశీ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 27న ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఉద్యోగులందరూ హాజరుకావాలని తెలిపారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైనసేవలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : పేద ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అమలు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అమల్లో పీహెచ్‌సీ స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యులను స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మారుమూల గ్రామాల్లో అకింత భావంతో వైద్యులు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు సంపన్నవర్గాలు మాత్రమే ఉపయోగించుకునేవారన్నారు. పేద ప్రజలకు కూడా అంటువంటి సేవలను అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజిషియన్ విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. నడవలేని స్థితిలో వైద్య సేవలకు ఆసుపత్రులకు చేరుకోలేని వారికి నేరుగా గడప వద్దకే వైద్య సేవలను అందించడమే ఫ్యామిలీ ఫిజిషియన్ విధాన లక్ష్యమన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేసి వారిలో ఒకరు ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు వైద్యం అందిస్తూ మరొకరు గ్రామీణ స్థాయిలో పర్యటిస్తూ డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 239 వైస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది 104 వాహనం ద్వారా గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా 67 రకాల మందులు అందుబాటులో ఉంచారని 14 రకాల డయాగ్న స్టిక్ మెడికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో ఏ కొండూరు మండలంలోని గ్రామాల్లో క్రానిక్ కిడ్నీ డిసీజస్‌పై కూడా కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా తండాల్లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించి ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నెల రోజుల నుండి జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఇబ్రహీంపట్నం జూపూడి, రెడ్డిగూడెం మండలం రంగపురం, చంద్రాలలోని మైలవరం పీహెచ్‌సీ-4, ఏ కొండూరు మండలం కోడూరు, జి.కొండూరు మండలం చెరువు, మాదవరం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు సుధాప్రసూజ, సందేష్, నరేష్, దివిజ, కార్తీక్‌లను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసర్ బానో, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ నళినిదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుమన్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్పందనలో ఆర్జీలను స్వీకరించి ఆర్జీదార్ల నుండి సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకుని పరిష్కరించినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి అర్జీదార్లు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో స్పందనను ఆశ్రయిస్తారన్నారు. ఆర్జీదార్లల నుండి అర్జీని స్వీకరించి రశీదు ఇచ్చినంత మాత్రన సమస్యలు పరిష్కారం కాబోవని, సంబంధిత అధికారులు ఆర్జీదారుడు ఇచ్చిన వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్య గుర్తించి త్వరితగతిన తగిన న్యాయం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన మంచి ఫలితాలను ఇస్తోందని దాదాపు 50 శాతంపైగా సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించగలుగుతున్నామన్నారు. మిగిలిన ఆర్జీలు కొన్ని కోర్టుల పరిధిలోను, మరి కొన్ని రెవెన్యూ కోర్టుల పరిధిలోను ఉంటున్నాయని వాటిని ఏవిధంగా పరిష్కారించాలనే ఆలోచన చేయాలన్నారు. అదేవిధంగా సబ్ డివిజన్, రస్తాల ఈజ్‌మెట్ ఏవిధంగా చేయాలనే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. స్పందన పోర్టల్లో గడువులోగా పరిష్కరించాల్సిన వాటిని తక్షణమే పరిష్కరించాలని గడువు తీరిన అర్జీలు ఉండరాదన్నారు. 48 గంటల్లో పరిష్కరించాల్సిన వాటిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో అధికారులు స్పందన ఆర్జీలపై పరిష్కారం చూపకపోవడంతో అధిక స్థాయిలో అర్జీలు పునరావృతం అవుతున్నాయన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తద్వారా అర్జీదారులకు సరైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ స్పందనలో 85 వినతులు నమోదు కాగా వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 36, పోలీస్-11, ఎంఏయూడీ-7, విద్య-3, వైద్య-3, సర్వే అండ్ సెటిమెంట్-3, పంచాయతీరాజ్-7, వివిధ శాఖలకు సంబంధించి 15 అర్జీలు నమోదయ్యాయన్నారు. తన పరిధిలోని వాటిని కలెక్టరు తక్షణమే పరిష్కరించగా కొన్నింటిని విచారించి పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, అసిస్టెంట్ డిప్యూటి కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జే.సునీత, డీఈవో సీవీ రేణుక, ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి కె.అనురాధ, డీఎస్వో పి.కోమలిపద్మ, హౌసింగ్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

నగరపాలకసంస్థలో...

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే స్పందన కార్యక్రమ ముఖ్యోద్దేశ్యమని నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార దిశగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమీషనర్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్పందనలో పెట్టుకున్న అర్జీలను తిరిగి పునరావృతం కాకుండా తక్షణమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టి ఆయా సమస్యలను పరిష్కరింప చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో ప్రధానంగా పట్టణ ప్రణాళిక-3, ఇంజనీరింగ్-3, పబ్లిక్ హెల్త్ విభాగం-1, యూసీడీ-4, రెవిన్యూ-2, ఎస్టేట్-2 విభాగాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎం.శ్యామల, అదనపు కమిషనర్ కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, యూసీడీ పీవో శకుంతల, డిప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏ.డీ.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్ పనులు వేగవంతం : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఎక్సెల్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌ను కమిషనర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ఆవరణలో ఎంట్రన్స్ గేట్లు, శానిటరీ ఆఫీసు బిల్డింగ్, స్టోర్‌రూమ్, డ్రైవర్ల టాయిలెట్లు(రెస్ట్ రూమ్) నిర్మాణం జరుగుతున్న పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న రోడ్ల పనులు పదిహేను రోజుల్లోపు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఎక్సెల్ ప్లాంట్‌లో ఉన్న ఐకానిక్ పార్కులో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కేవీ.సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హిజ్రాలపై వివక్షతను విడనాడాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ పర్సెప్షన్ సర్వేలో భాగంగా వీఎంసీ అధికారులు స్థానిక రాజీవ్‌గాంధీ పార్కులో సోమవారం హిజ్రాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. హిజ్రాలను వివక్షతో చూడకూడదు వారు మన సమాజంలో అందరితో సమానమనే ఉద్దేశంతో వారితో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా హిజ్రాలు అధికారులతో ఫోటోలు దిగారు. హిజ్రాలతో కలసి ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022 కేంద్ర ప్రభుత్వం గృహకల్ప, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశంలోని నగరాల్లో జీవన ప్రమాణాలు, సుస్థిరమైన వసతులు, ఆర్థిక వనరులపై సిటిజన్ పర్సెప్షన్ సర్వే చేస్తుందని తెలిపారు. ఈ సర్వేలో నగరంలో అందిస్తున్న వసతులపై ప్రశ్నావళి ఉంటుందని నగర వాసులందరూ ఈ సర్వేలో పాల్గొని జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాదించేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఈవోఎల్ 2022 (ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022) బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధనపు కమీషనర్ కే.వెంకట సత్యవతి, యూసీడీ పీవో కే.శకుంతల, సీడీఓ జగదీశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.

రామూర్తికి రాష్ట్ర వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. రామ్మూర్తి సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతికి ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ తరుపున సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది చేనేత కులాల సంఖ్యా బలం ఉంటుందని అంచనా వేసి నేతన్నల సంఘటిత పోరు ద్వారా రాజ్యాధికారం సాధించవచ్చుని బొమ్మన రామచంద్రవు, డా. శీరం శ్రీరామ చంద్రమూర్తి, కాలేపు సత్యనారాయణ మూర్తి వంటి చేనేత దిగ్గజాలను కలుపుకొని 1992లో ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో చేనేత ప్రభంజనానికి నాంది పలికిన మహనీయులు రామమూర్తి అని కొనియాడారు. రాష్ట్రంలో 26 చేనేత కులాలున్నాయని ఈ కులాల మధ్య ఐక్యత వస్తే బడ్జెట్లో, పరిపాలనలో చేనేత వర్గం వారు తమ వాట సాధించుకొని సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించగలరని నమ్మి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్ళిన యోదుడని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు రామమూర్తి చేసిన కృషిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ 2018లో రాజమహేంద్రవరం వీవర్స్ సమ్మేళనంలో చేనేత బంధు పురస్కారంతో సత్కరించిందని గుర్తు చేశారు. చేనేత కులాల ఐక్యతతో మన హక్కులు సాధించుచుకోవాలన్న రామమూర్తి పిలుపును నిజం చేసిన నాడే వారికి నిజమైన నివాళులు అర్పించడం జరుగుతుందని చేనేత సమాజం తెలుసుకోవాలన్నారు. రామమూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ రెండు రోజులు సంతాప దినాలను ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రకటిస్తూ ఘనం నివాళులు అర్పిస్తుందని పేర్కొన్నారు.

ఎన్జీఓ సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఏలూరు జిల్లా చాట్రాయి మండలాల పరిధిలో పనిచేస్తున్న విస్సన్నపేట ఏపీ ఎన్జీవో సంఘం ఎన్నికలకు సంఘం జిల్లా నాయకత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అధ్యక్షుడు పి.రవికుమార్ తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి సంఘ భవనంలో నామినేషన్ల స్వీకరణ, డిసెంబరు 5వ తేదీన ఎన్నికలు ఉంటాయని ఆయన వివరించారు.

దేవాలయంలో చోరీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలం కలగర పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఈనెల 19వ తేదీ రాత్రి దేవాలయంలో పూజల అనంతరం తాళాలు వేసి, ఇళ్లకు వెళ్లామన్నారు. 20వ తేదీ ఉదయం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి, చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి మెడలోని సుమారు రూ.36వేల విలువైన నగలు చోరీకి గురైనట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైకును ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట హైవే క్రాస్ రోడ్డు వద్ద బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నందిగామ శివారు అనాసాగరం గ్రామానికి చెందిన మునగాల రామగోపి (27)గా గుర్తించామని ఎస్ ఐ. హరి ప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు. పోలీసులు గాయపడిన శీలం రాఘవులు అనే వ్యక్తిని నందిగామ ప్రభుత్వ తరలించారు.

పోలీసులకు రివార్డులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విధి నిర్వహనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు నగదు రివార్డులను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమైన స్నేహపూర్వకంగా మెదులుతూ, వారి సమస్యలను పరిష్కరించాలని, పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది క్రైమ్ పోలీసులకు, రివార్డులను అందజేశారు. అందులో క్రైమ్ డీసీపీ పీ.వెంకటరత్నం, ఏసీపీ చలసాని శ్రీనివాసరావు, బి.ఆదినారాయణ, సీఐలు పీ.కృష్ణ, యం.రామ్‌కుమార్, ఎస్సైలు కృష్ణారావు, ఎస్.ఫ్రాన్సిస్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సహకరించిన వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-విజయవాడ(స్పోర్ట్స్) : షూటింగ్ బాల్ మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ షూటింగ్ బాల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్, కార్యదర్శి గోగులమూడి విజయ్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 18, 19 తేదీలలో నున్న వికాస్ కళాశాల ఆవరణలో షూటింగ్ బాల్ సీనియర్ మహిళల, పురుషుల అంతరజిల్లాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు వసతి సౌకర్యాలు కల్పించిన వికాస్ కళాశాల యాజమాన్యం చైర్మన్ నర్సీ రెడ్డి , సెక్రటరీ కరెస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు టీ.షర్ట్ లు అందించిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, షూటింగ్ బాల్ అసోసియోషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, బహుమతులు అందించిన హనుమంత్ రాజేశ్వరరావు ఉషా రానికి, క్రీడలు విజయవంతం కావటానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బి భాగ్యరాజ్ ఆర్ అశోక్ కుమార్, సరళ, వెంకట్రావు, వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ గుడే రాజు, వైస్ ప్రిన్సిపాల్ బి ఉదయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు వివిధ జిల్లాలా షూటింగ్ బాల్ కార్యదరులకు ఎన్టిఆర్ జిల్లా కోశాధికారి రవి కిశోర్, ఎపి సాఫ్ట్ టెన్నిస్ కార్యదర్శి దారం నవీన్, కోశాధికారి అబ్దుల్ కరీం కి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యకు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: పట్టణంలోని 13వ సచివాలయం 28వ వార్డులో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి స్థానికులు విపరీతంగా పెరిగివున్న పిచ్చి మొక్కలు గుర్రపు డెక్కను తొలగించమని కోరగా వెంటనే అధికారులతో మాట్లాడి ఆ సమస్యకు సత్వర పరిష్కారం చేసారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే ఉదయ భాను కి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): ఆటో ఢీకొట్టి వృద్ధురాలు మృతి చెందిన ఘటన సోమవారం విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణపురంకు చెందిన శకుంతం(68) పని నిమిత్తం ఫుడ్ జంక్షన్‌కు వైపు వచ్చింది. పనులు చూసుకుని తిరిగి నడుచుకుంటూ వెళున్న సమయంలో గవర్నమెంట్ ప్రెస్ నుండి ఫుడ్ జంక్షన్ వైపు వస్తున్న ఆటో అతీవేగంగా ఢీకొట్టింది. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ మేరకు మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

విశాలాంధ్ర విజయవాడ లీగల్ : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు, రూ.7 వేలు జరిమానా విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజా దేవి సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయవాడ, కొత్తపేటకు చెందిన యువతికి విజయవాడ, అజిత్ సింగ్‌నగర్‌కి చెందిన చిల్లా వెంకటేష్ రెడ్డికి 2007 లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కాగా, భర్త తన భార్యను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో 2017 జనవరి 20న వివాహిత తల్లి తన కుమార్తె ఇంటికి చూడడానికి వెళ్ళగా, తన కుమార్తె వంట గదిలో మెడ కోయబడి రక్తపు మడుగులో చనిపోయి ఉంది. ఫిర్యాది తన కుమార్తె మరణానికి అల్లుడే కారణమని అజిత్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. ఈ కేసులో ఏ.పి.పి చంద్రగిరి విష్ణు వర్ధన్ 18 మంది సాక్షులను విచారించగా నిందితుడి (33) పై నేరం రుజువు కావడంతో జీవితకాలం కఠిన కారాగార జైలు శిక్ష (జీవిత ఖైదు) , రూ.7 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : చేపల వినియోగాన్ని పెంచేందుకు జిల్లాలో ఫిష్ రిటైల్ అవులెట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుని మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న జాతీయ మత్స్య దినోత్సవం కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ ప్రత్యేక్ష ప్రసార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన 7 మండలాల పరిధిలో కృష్ణానది పరీవాహక ప్రాంతం ఉందన్నారు. కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్‌లో సుమారు 1400 మంది లైసెన్స్ కలిగిన మత్స్యకారులు చేపల వేట చేస్తున్నారన్నారు. 85 మత్స్య సహకార సంఘాల ద్వారా 4,326 మంది సభ్యులు జీవనోపాధిని పొందుతున్నారని, మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యాం కల్పించి వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఫిష్ రిటైల్ అవులెట్లు, ఫిష్ రిటైల్ మార్కెటింగ్ హబ్‌లు, ఫిష్ కియోష్కా, ఐస్ బాక్సులతో కూడిన టూవీలర్, త్రీ వీలర్ మోటర్ సైకిళ్ళ పంపిణీ, లైవ్‌ఫిష్ అమ్మక కేంద్రాల ఏర్పాటు పథకాలకు సబ్సిడీపై ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రూ.20 లక్షలతో ఇన్సలేటడ్ వాహనాల ఏర్పాటు, ఐస్ బాక్సులతో కూడిన టూవీలర్ మోటర్ సైకిళ్ళు, త్రీ వీలర్ మోటర్ సైకిళ్ళకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన దరఖాస్తులను అమోదించిన్నట్లు తెలిపారు. ఫిష్ ఆంధ్ర కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మత్స్య సంపదను పెంచేలా మత్స్యకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో లైఫ్ ఫిష్ అమ్మకాలపై ప్రజలు ఆశక్తి చూపుతున్నారని, కొనుగోలుదార్లను ఆకర్షించే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహించడం ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 50 ఏళ్లు దాటిన 1,262 మంది మత్స్యకారులకు నెలకు రూ. 2,500 పెన్షన్ అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది కృష్ణానదిలో 15 లక్షల చేప పిల్లలను విడుదల చేయనున్నామని, వేట నిషేద భృతి కింద జిల్లాలో 409 మంది మత్స్యకారులకు ఒక్కక్కొరికి రూ.10 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెంకు చెందిన పీ.వీర్రాజు, కృష్ణలంకకు చెందిన టి.వాసులకు మత్స్యకార భీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. జిల్లాలో అక్వా సాగు చేస్తున్న 20 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ సౌకర్యం కల్పించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, జిల్లా మత్స్య శాఖాధికారి ఏ.నాగరాజా, పీఎంఎస్ లంకె గోవిందరాజులు, ఏడీ సీహెచ్.చక్రపాణి, ఎఫ్‌డీవోలు పీ.అఖిల, బీ.లెనిన్‌బాబు, వివిధ మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS VIJAYAWADA
ACP/Dispute. No. 24 of 2021
Between:
Gold Coin Chit Funds Private Ltd., Vijayawada, rep.By its Foreman: Sampara Rama Mohana Rao, Son of Tatabbai....................DISPUTANT
AND
Macharla Gopi and others .....OPPONENTS
To,
1.Macharla Gopi, Son of Rama Rao, Resident of D No. 41-23/3-13, Vallaui Vari Street, Krishna Lanka, Vijayawada-13.
2) Macharla Purna Devi, Wife of Gopi, Resident of D No. 41-23/3-13, Vallaui Vari Street, Krishna Lanka, Vijayawada-13.
....Opponents No. 1 and 2
Please take notice that the above claim petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to both of you and posted the case to 25-11-2022 for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata,Vijaya- wada-520010 to answer the claim on 25-11-2022 at 10-30 A.M. in person, failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)
Date of Ad journment: 25-11-2022
T.Anjaneyulu, Advocate,
26-03-2018,1st Floor,
Near KarimHotel, NRP Road
Gandhinagar,Vijayawada-3
Ph:93921 03578